# పట్టుబడిన దయ్యం

ఆ కుటుంబం క్రొత్తగా ఊరి వెలుపల వున్న ఆయింట్లో అద్దెకు దిగింది. కుటుంబ యజమాని ఆ ఇంట్లో దిగబోయేముందు అనేకమంది చెప్పారు: "అందులో దయ్యాలు నివసిస్తున్నాయి......అందులో వద్దండీ" అని. కాని ఆయనకి నమ్మకం లేకపోవడంవల్లనూ, తక్కువ అద్దెకు అంత మంచిఇల్లు కుదురుతూందన్న ఉద్దేశ్యంతోనూ, ఊరికి కొంత దూరం అయినప్పటికీ అందులో ఉండటానికే నిశ్చయించుకుని కుటుంబ సమేతంగా దిగాడాయన.

అంతకుముందు అనేకమంది అందులో అద్దెకున్నారు...రాత్రిళ్లు వాళ్లకేవో కూతలు వినపడ్డం...కొన్ని కొన్ని సామాన్లు కనబడకుండా పోవడం జరిగింది. ఒకాయన కూతురు భయపడి తీవ్ర జ్వరానికి పాల్పడి బ్రతికి బయట పడేటప్పటికి బ్రహ్మాండం అయింది. అప్పటినుండీ ఆ ఇంటికి 'దయ్యాలకొంప' అనే సార్థక నామధేయం కూడా వచ్చింది.

ఆయా విషయాలు సమగ్రంగా తెలుసుకుని లెక్కేమిటన్నట్లుగా అందులో దిగాడు ఆ కుటుంబయజమాని వెంకట్రావుగారు. ఆ ఇల్లుయజమాని పట్నంలో నివసిస్తున్నాడు. ఎవ్వరూ అందులో ఉండటానికి ధైర్యం చెయ్యకపోగా అంత ఇంటినీ వెంకట్రావుగారికి తక్కువ అద్దెకిచ్చాడు ఇంటి యజమాని రామారావు.

వెంకట్రావుగారి కుటుంబం అంత పెద్దది కాదు అంత చిన్నదీ కాదు. ఇద్దరు కొడుకులు ఇద్దరు కూతుళ్ళూ. కూతుళ్లిద్దరికీ పెళ్ళిళ్లు చేశాడు. అత్తవారిళ్లకు పంపాడు. ఇంక ఇంట్లో ఉంట ఇద్దరు కొడుకులూ తనూ భార్యా. పెద్ద కొడుక్కి పెళ్ళయింది. అతని పేరు సుబ్బారావు. భార్య పేరు సుశీల. అతను టైపిస్టుగా ఇంజనీరు ఆఫీసులో పని చేస్తున్నాడు. వెంకట్రావుగారు హైస్కూలు టీచరు. ఇంక నాలుగైదేళ్లలో రిటైర్ అవ్వడానికి సిద్ధంగా వున్నాడు. ఆయన ఖర్చు విషయంలో కొద్దిగా వెనకతీసే స్వభావంగల వ్యక్తి. రెండో కొడుకు ఫిఫ్త్‌ఫారం చదువుతున్నాడు.

వెంకట్రావుగారు చేరిన కొత్తలో "ఇటువంటి ఇంటికి అలాటి పేరెలా వచ్చిందా?" అని ఆశ్చర్యపడ్డారు. ఆ ఇంటికి చుట్టుపట్ల ఎక్కడా ఇళ్ళులేవు. పట్నం పోవడానికి ఒక మైలుదూరం నడవాలి. దూరంగా మిల్లు మాత్రం వుంది...ఎటువైపు చూసినా దట్టంగా చెట్లు...దూరంగా కొండలు, సీనరీ అంతా అందంగా వుంటుంది...హాయిగా ప్రాణం లేచివచ్చేటట్లుగా చల్లటిగాలి! దీంతో వెంకట్రావుగారు చాలా సంబర పడ్డారు. సైకిలుమీద స్కూలుకి వెళ్లి వస్తూంటారాయన.

ఆయన నేకసార్లు దెయ్యాలు లేవని వాదించాడు. ఉంటే చూపెట్టమన్నాడు. అప్పుడు ఒక స్నేహితుడన్నాడు: "అమావాస్యనాటి రాత్రి ఒక్కడివీ శ్మశానవాటిక దగ్గరకు వెళ్లిరా తెలుస్తుంది...ఐదు రూపాయలు పందెం!" అన్నాడు. వెంకట్రావ్ గారు ఆ అమావాస్య నాటిరాత్రి దుడ్డుకర్ర పుచ్చుకొని శ్మశాన వాటిక దగ్గరకెళ్లి హాయిగా

*~~~~~~~~~~~~~~~~*

"మధుశ్రీ"

*~~~~~~~~~~~~~~~~*

తిరిగి వచ్చి ఐదు రూపాయలూ పుచ్చుకున్నాడు. ఆలాంటి దిట్ట ఆయన. ఆవిషయంపై ఆయనతో ఎవరూ గట్టిగా వాదించరు.

అలాంటి ధైర్యం వుందిగనుకనే ఆయన అందులో అద్దెకు దిగగలిగాడు!

భార్యా కొడుకూ చెప్పి చూశారు అనేక విధాల. కాని ఆయన వినలేదు. కోడలికి మరీ భయం...ఆయనభార్యా కోడలూ ఆంజనేయ దండకం పఠించందే ఏరాత్రీ నిద్రపోరూ!

ఇలా ఒక వారంరోజులు సవ్యంగానే సాగింది. ఒకరాత్రి:

ఆ రాత్రి పన్నెండయింది. ఇంట్లో అందరూ గాఢసుషుప్తిలో మునిగి వున్నారు. ఒక ముసుగు వేసుకున్న ఆకారం వీధివైపునున్న సామానుగదిలో ప్రత్యక్షం అయింది. అది సామానుగది. ఆ ఇంట్లో అద్దెకున్న వాళ్ళకీ ఆగదికి సంబంధంలేదు. అందులో విరిగిన కర్ర కుర్చీలు...డబ్బాలు...చెత్తాచెదారం వుంటాయి. ఆగది ఇంటియజమానికే వుంచబడింది. అంటే ఆగది మినహాయింపుగా ఆ ఇల్లు అద్దెకిస్తారు. నల్లటి ఆకారం గదిగోడ తడిమి ఒక మీట నొక్కింది. గోడలో కొంతభాగం ప్రక్కకి తప్పుకుంది. అక్కడేర్పడిన ద్వారంగుండా వెడితే సుబ్బారావు, సుశీలా పడుక్కునే గదిలోకి వెళ్లవచ్చు.

ఆ ఆకారం గదిలోకి వెళ్ళింది. ముఖం మీద ముసుగు తీసింది. వికృతమైనముఖం... ఎంత గుండెదిటవున్న వాళ్ళయినా నిలువునా నీరయిపోతారు! అంత భయంకరమైన ముఖం. గదిలో బెడ్‌రూంలైటు వెలుగుతూంది....

సుశీల మంచి అందమయినది. మందమందంగా వున్న బెడ్‌రూంలైటు వెలుగులో ఆమె శరీరం మెరుస్తూంది. ప్రక్కనే సుబ్బారావు గుర్రుపెట్టి నిద్రిస్తున్నాడు. ఒక వింత అందాన్ని ప్రతిఫలిస్తూంది ఆమె ముఖం... చూడబోయేటప్పటికి ఆ ఆకారం మనసులో ఏవో శక్తులు కదిలాయి...

ఆకారం నెమ్మదిగా కదిలింది...నిద్రపోతున్న ఆమె చెక్కిళ్ళపై ముద్దు పెట్టుకుంది...మెళ్ళో నెక్లెస్ మెరిసింది. నెమ్మదిగా ఆ నెక్లెస్ తీసి మొలలో పెట్టుకుని ఆ ఆకారం ఆమె ముఖంలోకి చూస్తూ వెనక్కి కదిలింది. వెనక్కి వెళ్ళడంలో మేజామీదున్న మంచినీళ్ళ గ్లాసు క్రిందపడి గణగణమని చప్పుడయింది.

ఆ చప్పుడికి సుశీల మేలుకుంది. లేచి కూర్చుంది...నలువైపులా చూసింది...ఆ ఆకారాన్ని చూసి కెవ్వుమని ఒక్కకేకవేసి క్రింద పడిపోయింది.

ఆ కేకతో ఇంట్లో ఉన్నవాళ్లందరూ లేచారు. గబగబా సుశీలగదికి చక్కా వచ్చారు.

ఆ ఆకారం మాయమైంది! సుశీల నందరూ చుట్టుముట్టారు...సుశీలకి శ్వాసమాత్రం ఆడు



# ★ పట్టుబడిన దయ్యం ★

తూంది...అందరూ కంగారుపడడం మొదలు పెట్టారు. సుబ్బారావు చెంబుతో చన్నీళ్లు తీసుకువచ్చి సుశీలముఖంపై చిలకరించాడు. కొంతసేపటికి సుశీల నెమ్మదిగా కళ్ళు తెరి చింది...గది నలుమూలలా పరికించింది... గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి...

"వెళ్లిపోయిందా?" నీరసంగా ప్రశ్నించింది.

"ఏమిటికి..." అన్ని కంఠాలు ఒక్కసారి భయోద్వేగంతో అడిగాయి.

"దయ్యం...!" అంది సుశీల కళ్లు గట్టిగా మూసుకుంటూ.

"ఎక్కడికి ఏమిటికి" అని తొందరగా ప్రశ్నించింది అత్తగారు వొణికిపోతూ.

"మరేం కంగారుపడకండి!" అన్నారు వెంకట్రావుగారు.

"మీరంతా కంగారుపడి ఆమెని భయపెడతారేం ఇవతలకు రండి!" అని మళ్లీ గట్టిగా చివాట్లుపెట్టేధోరణిలో అన్నాడు.

ఎవ్వరూ నోరు మెదపలేదు...

సుశీల దగ్గరకు వెంకట్రావుగారు వచ్చి "అమ్మాయ్ సుశీలా-ఇలా చూడు ఏం జరిగిందో అసలు చెప్పు...భయపడకు మేం వున్నాంగా..." అన్నాడు.

వొణికే కంఠాన్ని సుశీల సర్దుకుంది. ఏలాగో చెప్పసాగింది.

"నిద్దట్లో నాముఖాన్ని ఎవరో ముట్టుకున్నట్లుగా అనుమానం వచ్చింది. నాకు పూర్తిగా మెలుకువరాలేదు...ఒత్తిగిల్లి పడుకున్నాను ఆ మగతనిద్రలోనే!" అని కళ్ళు మూసుకుంది కొద్దిక్షణాలూరుకుని మళ్ళీ చెప్పింది.

"మేజామీద వున్న నీళ్ళగ్లాసు క్రిందపడి చప్పుడయింది...నాకు మెలుకువవచ్చి లేచి కూర్చుని గదంతా కలయచూశాను...అబ్బ భయంవేస్తోంది తల్చుకుంటే...ఏదో ఒక వికృతమైన ముఖం కనబడింది. వొళ్ళంతా నల్లటిముసుగు...చూస్తూండగానే మాయమయింది...ఆతరువాత నాకు తెలియలేదు..." అంది గజగజ వొణికిపోతూ.

వెంకట్రావుగారు గది పరిశీలించారు మంచినీళ్ళగ్లాసు గోడకి వారగా పడిపోయి వుంది. నీళ్లు క్రింద వొలికిపోయి నేల తడిగావుంది...అడుగుల ఆనవాళ్లు మొదలైనవేవీ కనబడలేదు...మేజాక్రిందవున్న నల్లపిల్లి మ్యావ్‌మని అరుచుకుంటూ ఇవతలకు చక్కా వచ్చింది...వెంకట్రావుగారి ముఖంలో హాసరేఖ లుదయించాయి!

దయ్యాలకొంప అని పేరువిని వీళ్ళసలే భయంతో సతమత మవుతున్నారు. దానికి తోడు ఏం చూచినా అలాగే అనిపిస్తుంది అని సైకాలజీలో వుంది. పరీక్షకి కూర్చున్న అబ్బాయికి పేపర్లో ప్రతీవొక్క నంబరూ తనదిలాగే కనుపిస్తుంది. కలతనిద్రలో భయపడివుంటుంది సుశీల అని స్థిరనిశ్చయాని కొచ్చారు వెంకట్రావుగారు.

"అమ్మాయ్ సుశీలా ఇదిగో ఈపిల్లిని చూడు...ఇదే ఇంత హడావుడి చేసింది. నువ్వసలే భయంతో వున్నావు...అంచాత నీకలా అనిపించింది...దయ్యాలేమిటమ్మా!" అన్నారు తేలికగా. రజ్జుసర్పభ్రాంతి అన్నది కూడా ఇలాంటిదే. తాడుని చూసి పామని భయపడితే ఆభయపడ్డ వ్యక్తికి జ్వరంవచ్చే నావకాశం వుంది...అది త్రాడుఅని నిరూపించేవరకూ ఆవ్యక్తి జ్వరం తగ్గదు.

ఇంకా అనేక ఉపమానాలు చెప్పి వెంకట్రావుగారు కోడలికి కొంత ధైర్యాన్ని చేకూర్చారు...

కాని వెంకట్రావుగారికి "ఇదేవిటికి దీంట్లోకుతంత్రం ఏదైనావుందా? దీన్నెలాగ వదిలించటం" అనే ఆలోచనలు పట్టుకున్నాయి. వెంకట్రావుగారికి ఏభయ్ ఏళ్లు దాదాపుగా వచ్చినప్పటికి మంచి బలవంతుడుగాను ఏముప్ఫయ్యేళ్ల వ్యక్తిగానో కనబడతారు. బలానికి తగ్గ ధైర్యవంతుడాయన. ధైర్యానికి తగ్గ చొరవ, చురుకు ఉన్నాయి. దీన్నెలాగయినా ఒక అంతానికి తేవాలనుకున్నారు.

ఇంట్లోవాళ్లందరికీ ధైర్యం చెప్పినప్పటికీ దీని వెనుకఏదో వుందనే స్థిర నిశ్చయానికి వచ్చాడాయన. ఎందువల్లంటే కొన్ని కొన్ని స్థలాల్లోవుండే వస్తువులు స్థలాలు మారుతున్నాయి. వాట్లని ఇంట్లో ఎవ్వరూ ముట్టుకోలేదన్నారు.

ఇద్దరు ముగ్గురు స్నేహితులు డిటెక్టివ్‌ని అప్పాయింటు చెయ్యమని ప్రోత్సహించారు. మరికొందరు "మేం వద్దని చెప్పలేదా? మరేం అనుకున్నారు?" అన్నట్లుగా ముఖాలు పెట్టారు. ఊళ్ళో విరివిగా తిరుగుతూన్న డిటెక్టివులని పెట్టడం ఎంత మాత్రం వెంకట్రావుగారి కిష్టంలేదు. "నేనే ఎందుకు ఈవిషయాన్ని కనిపెట్టలేను?" అన్న ధైర్యం ఆయనకుంది.

ఏదైనా వెయ్యిరూపాయిల ఖరీదైన నెక్లెసు పోయింది. నిజంగా దయ్యమే అయినట్లయితే దొంగిలిస్తుందా? అది అసాధ్యమయిన పని!

"పరిస్థితులు ఎలా మారుతాయో" అనుకుని వెంకట్రావుగారు రాత్రిళ్లు కాస్త మెలుకువగా వుండటం మొదలుపెట్టారు.

రెండురోజులు మళ్లీ ఏవీలేదు. ఆ తరువాత ఏవో కొన్ని చప్పుళ్లవుతున్నాయని కొడుకు సుబ్బారావు చెప్పాడు.

"దీని అంతు తేల్చాలని దీక్షవహించారు వెంకట్రావు గారు.




చర్మపుబాధలకన్నిటికి

"సైబాల్"

చర్మవాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విష క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, పొంటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చుడంలో అద్భుతంగా పనిచేస్తుంది.




బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబీ గ్రైప్"

తయారుచేయువారు.

దిసౌత్ ఇండియన్
మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు:

సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్
విజయవాడ, సికింద్రాబాద్.
బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.

ఒక నెలరోజులు మామూలుగానే సాగింది. ఇంట్లో అందరూ ఆవిషయం కొద్ది కొద్దిగా మర్చిపోవడం ప్రారంభించారు. ఆ గొడవ అణిగింది. వెంకట్రావుగారు ఇంట్లో వాళ్లకికూడా చెప్పకుండా దుడ్డుకర్ర ఒకటి పుచ్చుకుని కాపలాకాయడం మొదలు పెట్టారు. ఆయనకేమీ ఆచూకీ కనబడ్డం లేదు.

కాని ఆయనకొక అనుమానం వచ్చింది. తిన్నగావెళ్ళి సామానుగది పరిశీలనగా చూశారు. ఎక్కడా ఏవిధమైన గుర్తులూ కనబడలేదు. ఆగదికి ఒకే ఒక గుమ్మం వుంది. అదితాళం వెయ్యబడి వుంది. ఆతాళపుకప్ప ఈమధ్యనెప్పుడు తెరిచినట్లుగా కనబడ్డం లేదు. దుమ్ముతో నిండివుంది. అందులో సామానే వుందా? లేకపోతే ఏం వుంటుంది? అది ఆయన ఆలోచన. ఇంట్లో వున్న తాళాలన్నిటితోటి ఆకప్ప తియ్యడానికి ప్రయత్నించారు. కాని కదల్లేదు.

గునపంతో పెల్లగించి తాళం కప్ప ఊడ పెరికారు. తలుపుగొళ్లెం తీసి లోపలికి వెళ్లారు. మామూలుగానే వుంది...దుమ్ము దుల్లుతూ వుంది. చెదపట్టిన కర్ర కుర్చీలు చిరిగిన చాపలు పడివున్నాయి. గోడకి ఒక అలమార వుంది. దాని తలుపులు కూడా సగం సగం విరిగి ఉన్నాయి...ఎక్కడా అనుమానాస్పదమైన విషయాలు కనబడలేదు. అయినప్పటికి ఆ రాత్రి అందులో దాగికొని చూద్దామనుకున్నారు వెంకట్రావు గారు. దుడ్డుకర్ర పుచ్చుకుని ఒక మూలగా చాప వెనక దాగి కూర్చున్నారు. పొంచి చూస్తున్నారు...అలా చూస్తుండగానే నేలమీద ఒకనాపరాయి లేచింది...జాగ్రత్తగా చూస్తున్నారు వెంకట్రావుగారు. నల్లటి ముసుగుతో ఒక ఆకారం పైకి ఎక్కింది. అటూ ఇటూ చూసింది... చూసి గోడలో ఒక మీటి నొక్కింది... ఆ మీట తెలుసున్నవాళ్ళకి తప్ప ఎక్కడుందో ఎవ్వరికీ తెలియదు. గోడలో ద్వారం ఏర్పడింది...ఆ ఆకారం గోడలో దూరుతూంది. అదేసమయంలో వెంకట్రావు గారు దుడ్డుకర్రతో ఒక పెట్టుపెట్టారు... అంతే "బాబోయ్" అంటూ ఆ ఆకారం క్రింద పడింది చైతన్య రహితంగా....

"వెంకట్రావు దెబ్బంటే దెయ్యాలు పాడులుతాయి, జాగ్రత్త, కదిలావంటే?" అంటూ దుడ్డుకర్ర గుండెల మీద గురిపెట్టి పట్టుకుని సుబ్బారావుని పిల్చారు వెంకట్రావు గారు. ఇంట్లో వాళ్లందరూ లేచారు. సుబ్బారావు గదిలోకి వచ్చాడు.

"దయ్యం దొరికి పోయిందిరా అబ్బాయి. త్రాడు తీసుకురా కట్టివేస్తా!" అన్నారు వెంకట్రావుగారు నవ్వుతూ.

సుబ్బారావు త్రాడు తీసుకునిరాగా వెంకట్రావుగారు కొడుకుతో కలసి దయ్యాన్ని వీధి స్తంభానికి కట్టిపెట్టారు.

"హమ్మయ్య" అనుకున్నారందరూ.

తెల తెల్లవారుతూంది. ఆ వ్యక్తి ముఖం చాలా వికృతంగా వుంది. పోలీసులను రమ్మంటూ రిపోర్టు ఇచ్చారు.

అందరూ వచ్చారు. వెంకట్రావుగారు దయ్యం ముఖంమీద పిడికిలి బిగించి ఒక్క గుద్దు కసిదీరా గుద్దారు. అసహ్యమైన తొడుగు ముక్కలు ముక్కలై క్రింద పడింది.

ఆ అసలు ముఖంచూసి అందరూ ఆశ్చర్య పోయారు!

ఎవరూ?

ఇంటి యజమాని రామారావు!

నిర్ఘాంత పోయారందరూ. గదిలోకి వెళ్లి సొరంగంలోకి దిగారు. అది తిన్నగా కొంపొండు అవతలగా వున్న పొదలోకి వుంది! రామారావు పట్నంలో వుంటున్న ఇల్లు సోదా చెయ్యగా ఆ సొరంగం దొరికింది!

అప్పుడు సబ్ ఇన్‌స్పెక్టరుతో ఈ మాదిరిగా చెప్పటం ప్రారంభించారు వెంకట్రావు గారు:

"రామారావుగారికి వుద్యోగం లేదు. ఆయన పట్నంలో ఇంట్లో వుంటూ ఈ ఇంటిని తక్కువ అద్దెలకిస్తూ, అద్దె కుంటున్న వాళ్లని బెదరిస్తూ అందినంతవరకు దొంగిలిస్తూ ఆస్తిని సంపాదించాడు. నా కసలు మొదటి నుంచీ అనుమానమే ఇంత ఆస్తి ఈయన కెలాగ వచ్చిందాఅని...నాకు దయ్యాలంటే నమ్మకం లేదు. దాన్ని పట్టుకుందామనే ఈ ఇంట్లో దిగాను..." అంటూ తను చేసినదంతా వివరించాడు వెంకట్రావుగారు.

ఇన్‌స్పెక్టర్, వెంకట్రావుగార్నభినందించాడు. ఒక వెండి పొన్నుకర్రని బహుమతీ చేశాడు. ★

